
వృద్ధాశ్రమం
అనాథ ఆశ్రమం
KOCHERLA VR

# స్వతంత్ర వైపరీత్యం

"హలో... రజనీ... హలో... రజనీ... ప్లీజ్ మాట్లాడు". ఎంతో ఆర్ద్రంగా, ప్రేమగా ఆమెని కన్విన్స్ చేయడానికి ప్రయత్నిస్తూ పిలిచాడు ఫోన్‌లో సురేష్.

"హలో... చెప్పండి... ఇంకేముంది మన మధ్యలో?"

"అలా మాట్లాడకు రజనీ మనం ఎంతో ఇష్టపడి పెళ్ళిచేసుకొన్నాం. నీవెందుకు ఇలా తయారయ్యావో నాకు అర్థం కావటం లేదు".

"మీకు అర్థం అయినా అర్థం కానట్లు నటిస్తున్నారు కదూ!"

సురేష్ గతుక్కుమన్నాడు.

"నువ్వు చాలా మొండికేస్తున్నావు. ఎవరి జీవితం నాశనం అవుతుందో తెలిసే ఇలా చేస్తున్నావా?" మాటల్లో కరుకుదనం వచ్చింది సురేష్‌కి.

"నా జీవితం మాత్రం కాదు. మీ జీవితం గురించి ఆలోచించుకోండి" రజని నిష్కర్షగా మాట్లాడింది.

సురేష్‌కి మతిపోయింది. ఏ స్త్రీ అయినా భర్త వదిలిపెడితే పుట్టింటికి వెళ్ళి ఏడుస్తూ కూర్చుంటుంది. ఇదేమిటీ.. పుట్టింటికి పురుడు కని వెళ్ళి రానంటోంది.. భగవంతుడా! నాకు నువ్వే దిక్కు. ఆస్పత్రిలో ఆ రోజు పురిటి గుడ్డుని చూడనివ్వలేదు. అచ్చు తన కొడుకు రజనిలా ఉంటాడుట. తన స్నేహితుడిని పంపి చూసి రమ్మని చెప్పాడు. బాబు పుట్టక ముందు అమ్మని, నాన్నని, అక్కని ఎంతో బాగా చూసుకొంది. ఇప్పుడు అక్క, బావా ఇద్దరూ లేరు. అమ్మా, నాన్న రజనిని ఎంతో బాగా చూసుకొనేవారు. అక్క లేదు కాబట్టి రజనిని తమ కూతురులాగా భావిస్తున్నారు.

బాబు కోసం అందరూ ఎదురుచూస్తున్నారు. తను రాదు. బాబుని ఎప్పుడు చూడాలో తెలీడం లేదు. తలదించుకొని దిగాలుగా ఆలోచిస్తున్న కొడుకుని చూసి తల్లి కళ్యాణి హృదయం ద్రవించిపోయింది.

"బాబూ" కమ్మని అమ్మ పిలుపు సురేష్‌ని ఈ లోకంలోకి పడేసింది.

"అమ్మా...!" కళ్ళనీళ్ళు ఒక్కటే తక్కువ సురేష్‌కి.

"ఏరా బాబూ! అమ్మాయి ఏమంటోంది? వస్తానందా? నా మనవడిని చూడాలని ఉందిరా... ఒక్కసారి బాబుని చూపించమనరా!" తల్లి తనను ప్రాధేయపడడంతో సురేష్ తట్టుకోలేకపోయాడు.

"అమ్మా... తను వచ్చినా రాకపోయినా నీ మనవణ్ణి నీకు చూపించే బాధ్యత నాది".

తల్లికి సురేష్ మాటలు అర్థం కాలేదు.

"అదేంటిరా? కాపురం వదులుకొంటుందా? ఇక్కడ తనకి ఏం తక్కువయింది? ఆ

వడ్డాది లక్ష్మీసుభద్ర

అమ్మాయిని కాలు క్రిందపెట్టకుండా చూసుకుం టున్నాం కదా! ఇంటి పనికి పనమ్మాయి, బట్ట లు ఉతకడానికి చాకలి ఉన్నారు. వంటపనికి నేను ఉన్నాను. బాబు వస్తే వాడితో ఆడుకోవాల ని ఉందిరా...".

సురేష్ కదిలిపోయాడు. అమ్మా దానికి స్వా ర్థం ఎక్కువయింది. త్వరలోనే నీ కోడల్ని తీసు కువస్తాను. కంగారు పడకు. తల్లికి ధైర్యం చె ప్పాడే గానీ భార్య వస్తుందనే నమ్మకం కలగ లేదు. తల్లికి మరో మాట మాట్లాడ్డానికి అవ కాశం ఇవ్వకుండా వెళ్ళిపోయాడు.

మరో నాలుగు నెలలు ఎదురుచూసాడు. బాబుకి ఆరవనెల వచ్చేసింది. తను వెళ్ళి తీసు కువస్తే వస్తుందేమో చూద్దాం అనుకొన్నాడు సురేష్.

ఇంతలో తండ్రి వచ్చాడు.

'ఒరే అబ్బాయ్!.. మనవడు పుట్టి ఎన్నాళ్ళ యిందిరా?

ఆరు నెలలు అయింది నాన్నా... తలవంచు కొని చెప్పాడు'.

మరి బారసాల చేశారా? బహుశా చేసి ఉండరు. అమ్మాయిని తీసుకురారా... లేదా మంచిరోజు చూసి బారసాల చేసి పంపిస్తారే మో వెళ్ళి అడుగు. తెగేదాకా లాగకు... ఇది జీవితం. తెలిసిందా? "ఏరా మాట్లాడవేం?... బెల్లం కొట్టిన రాయిలాగా ఉంటే సరిపోతుం దా? అయినా కోడలు కనడానికి వెళ్ళినపుడు నాకెన్నో జాగ్రత్తలు చెప్పి వెళ్ళింది కదరా!" తండ్రి తల పట్టుకొని కుర్చీలో కూలబడ్డాడు.

"అలాగే నాన్నా!, మీరు చెప్పినట్లు చేస్తాను. ఇవాళే బయల్దేరుతాను" సురేష్ లేచి నిలబ డ్డాడు.

ఇంతలో స్కూలు నుంచి మేనగోడలు, మేన ల్లుడూ పరిగెత్తుకుంటూ వచ్చారు. 'మావయ్యా నాకు 'ఏ' గ్రేడు వచ్చింది. తమ్ముడికేమో 'బి' గ్రేడు వచ్చింది. యూకేజి చదువుతున్న సునీత, ఎల్‌కేజి చదువుతున్న బాబు అతని ఒళ్ళో వచ్చివాలారు.

"సురేష్ ఇద్దరినీ ముద్దుపెట్టుకొని, తప్పమ్మా! తమ్ముడు నీకన్నా చిన్నవాడు గదా! వచ్చేనెల 'ఏ' గ్రేడు తెచ్చుకొంటాడు" అంటూ వారిద్దరికీ స్నానం చేయించి, బట్టలు వేసి హోమ్ వర్క్ చేయించాడు.

"ఏరా బయల్దేరవేం? ఇప్పుడు ఏడు గంట లయింది. ఇంకో అర్థగంటలో మీ అత్తవారి ఊరికి ట్రైన్ ఉంది" అంటూ తల్లి టిఫెన్ డబ్బా చేతిలో పెట్టింది.

"అమ్మాయితో పోట్లాడకుండా జాగ్రత్తగా నచ్చచెప్పి తీసుకురా..." తండ్రి హెచ్చరిక చెవు ల్లో మారుమ్రోగుతుండగా బట్టలు సర్దుకొని బయలుదేరాడు.


తూర్పు తెల్లవారుతూండగా బట్టల బేగ్ చేతితో పట్టుకొని అత్తవారింట అడుగుపెట్టాడు సురేష్.

బావమరిది మొక్కుబడిగా 'బావున్నారా? బావగారూ' అని పలకరించి ఏదో పనున్నట్టు లోపలికి వెళ్ళిపోయాడు. కనీసం మర్యాదపూర్వ కంగా కూర్చోమని చెప్పకుండానే. సురేష్ అక్క డున్న కుర్చీలో కూర్చున్నాడు.

అత్తగారు వచ్చి "ఇంట్లో అంతా బాగున్నా రా?" అని అడిగింది.

"మీ అమ్మాయిని ఎప్పుడు పంపుతున్నా రు?" ముక్కుసూటిగా అడిగాడు సురేష్.

"ఓ... సురేష్‌గారా? ఎలా ఉన్నారు?"




అంటూ మావగారు అక్కడి కొచ్చారు పంచె సర్దుకుంటూ.

"మీ అమ్మాయిని తీసుకెళ్దామనుకొంటున్నాను" "తప్పదు... రానన్నా తీసుకెళ్తాను" అన్నట్లుగా అతని ప్రశ్నకి సమాధానం ఇచ్చాడు సురేష్.

"రానంటే ఏం చేస్తారు?" బాణంలా దూసుకొచ్చింది రజని.

అల్లుడుగారూ! చిన్న పని ఉంది... చూసుకొస్తాను. అంటూ మావగారు తప్పించుకొని వెళ్ళిపోయాడు. అతని వెనకాల అత్తగారు బయలుదేరింది.

అత్తగారు కాఫీ తీసుకొచ్చి సురేష్ చేతికిస్తూ అంది. "అమ్మాయి వస్తే తీసుకెళ్ళు మాకభ్యంతరం లేదు."

"మీరు మంచీ చెడ్డా చెప్పి పంపించాలి గానీ మీ అమ్మాయి ఆడింది ఆట, పాడింది పాటగా చేస్తే ఎలా?" మాటలలో విసుగు ధ్వనించింది.

'ఏమో నాయనా! మీరూ మీరూ చూసుకోండి'... అత్తగారు తనకు సంబంధం లేదన్నట్లుగా తప్పించుకొని వెళ్ళిపోయింది.

కొడుకుని చూద్దామని భార్య ఉన్న గదివైపు నాలుగుఅడుగులు వేశాడు సురేష్.

"బాబుని చూడాలంటే కొద్ది రోజులు ఆగాలి. బాబు ముఖం మీరు నూనెలో చూడాలి. దోషం ఉంది, శాంతి చేయాలని సిద్దాంతి చెప్పారు" అటూ బాబుని చూడకుండా సురేష్ని ఆపింది రజని.

సురేష్ మనస్సు కుతకుతలాడిపోయింది. ఎంతోదూరం నుంచి వచ్చిన తనకు కొడుకుని చూడడానికి వీలులేకపోయింది. సాంప్రదాయాలు పాటించే కుటుంబంలోంచి వచ్చినవాడు. పసివాణ్ణి చూస్తే ఏమవుతుందో తెలీదు." మనస్సులోనే కొట్టుమిట్టాడుతున్నాడు.

స్నానం, భోజనం అయిన తరువాత అత్త గారు, మామగారు బారసాల గురించి మాట్లాడు తారు అనుకొన్నాడు. కానీ వాళ్లు ఆ వూసే ఎత్త లేదు.

రాత్రి తనకు కేటాయించిన గదిలో పడు కొన్నాడు. రాత్రి పదకొండు గంటలకి వచ్చింది భార్య గదిలోకి.

"పాపం చాలా తొందరగా వచ్చావు గదిలో కి. మొగుడిని వదిలేసి ఈ పుట్టింట్లో నువ్వు చేస్తున్న రాజకీయాలు ఏమిటో?" సురేష్ మాట లలో కోపం, వ్యంగ్యం గమనించింది రజని.

"ఇంతకీ తమరు ఎందుకు వచ్చినట్లో?"

సురేష్‌కి ఒళ్ళు మండిపోయింది. ఎంత వ్యంగ్యంగా మాట్లాడుతోంది? "ఇంతకీ ఎం దుకు రానంటున్నావో చెప్పు"

"నేను రావాలి అంటే కొన్ని షరతులు మీ రంగీకరించాలి."

"ఏమిటా షరతులు?. అంటూనే ఏదో ఫిట్టిం గ్ పెట్టేట్లుంది" అనుకున్నాడు మనసులో.

"ఏమిటి? చెప్పమంటారా?"

"చెప్పు... వినక చస్తానా?!

రజని చెప్పిన రెండు షరతులూ విన్న సురేష్ కి మతిపోయింది.

"తిక్క తిక్కగా వాగుతున్నావేంటి? ఈ షర తులకి నేను ఒప్పుకోను. ఒకవేళ ఒప్పుకోవాలి అంటే ముందు బిడ్డని తీసుకొని మన ఇంటి కిరా. అక్కడ మా అమ్మ, నాన్నలతో మాట్లాడి చెబుతాను" ముందు భార్యని ఇంటికి తీసుకు వస్తే ఆ తరువాత ఏదో విధంగా నచ్చచెప్పుకో వచ్చు అనుకొన్నాడు సురేష్.

"కాదు... ఇప్పుడే అటో ఇటో తేల్చాలి"

రజని పెట్టిన షరతులకి ఒళ్ళు మండిన సురేష్ "సరే అయితే నేను చెప్పినట్లు ఇంటి కిరా" అన్నాడు.


"రాకపోతే"

"కోర్టులో కలుసుకొందాం"

సురేష్ తెల్లవారుతూండగా బయటకు

## ఒంగోలులో రాష్ట్రస్థాయి రచయితల మహాసభలు

ఒంగోలులో 2007 జనవరి 5,6,7 తేదీలలో రాష్ట్రస్థాయి రచయితల మహాసభలు నిర్వహించనున్నట్లు ప్రకాశంజిల్లా రచయితల సంఘ కార్యదర్శి శ్రీ పొన్నూరు వేంకట శ్రీనివాసులు తెలిపారు. వివిధ సాహిత్య ప్రక్రియలపై లబ్ద ప్రతిష్టులైన సాహితీ వేత్తలచే ఉపన్యాసాలు, కవి సమ్మేళనం, ప్రత్యేక మహిళా కవి సమ్మేళనాలు వుంటాయని, ప్రతినిధు లందరికీ ఉచిత భోజన వసతి సౌకర్యాలుంటాయనీ, ముగింపు సభలో మెమెంటో, ప్రశంసా పత్రాలతో ప్రతినిధులందరూ సత్కరించబడతారనీ ఆయన తెలిపారు. ప్రతినిధులుగా పాల్గొనదలచిన వారు తమ అంగీకారాన్ని జనవరి 5 లోగా తెలియజేయాలి. ఇతర వివరాలకు పొన్నూరు వేంకట శ్రీనివాసులు, కార్యదర్శి, ప్రకాశం జిల్లా రచయితల సంఘం, 33-1-5 తిరువెంగళం పిళ్ళైవారి వీధి, ఒంగోలు-523 001 (ఫోన్: 94404 32939) అనే చిరునామాలో సంప్రదించవచ్చు.




వచ్చేసాడు.

ఇంటికి వచ్చిన కొడుకు ముఖం చూడగానే తల్లికి అర్థమయిపోయింది కోడలు రానని చెప్పిందని.

తండ్రి అప్పుడే బయట నుంచి వచ్చి కాళ్ళు కడుక్కొని కొడుకు ప్రక్కనే కూర్చుంటూ అడిగాడు.

"ఏరా అబ్బాయ్... కోడలు రావడం ఎప్పుడు?" తండ్రి ఆతృత గమనించాడు. జరిగింది చెప్పలేకపోయాడు.

"ఒరేయ్... ఒక్కగానొక్క కొడుకువు. నువ్వు, నీ భార్య సుఖంగా ఉండడమే మాకోరిక. మీకేమి చేయమన్నా చేస్తాను" తండ్రి నిష్కపటమైన ప్రేమ సురేష్‌ని కదిలించింది.

"ఇక చెప్పక తప్పదు" అనుకొన్నాడు.

"మీ ఇద్దరినీ వృద్ధుల ఆశ్రమంలో చేర్పించాలిట".

"ఆ..." నోరు వెళ్ళబెట్టాడు తండ్రి.

"వాళ్ళ అమ్మని, నాన్ననీ వాళ్ళన్నయ్య వృద్ధుల ఆశ్రమంలో చేర్పించలేదే? తల్లి తన బాధ వెళ్ళగక్కింది.

"ఊ... ఇంకా ఏమందిరా?" తండ్రి అడిగాడు.

"అక్కపిల్లల్ని ఇద్దరినీ..."

"ఊ... చెప్పు నాయనా?"

"అక్క పిల్లల్ని ఇద్దరినీ అనాథ శరణాలయంలో చేర్పించాలిట" సురేష్ చేతిల్లో ముఖం దాచుకొని ఏడ్చాడు. అక్కపిల్లలంటే అతనికి ఎంతో ప్రేమ.

తండ్రికి మతిపోయింది. ఇద్దరు చనిపోయిన తరువాత మిగిలినబిడ్డ సురేష్. వీడిని కళ్ళలో పెట్టుకొని పెంచాము. విద్యాబుద్ధులు చెప్పి ఇంజనీర్‌ని చేసాము. వాడి చదువుకి ఉన్న కొద్దిపాటి ఆస్తి – ఇల్లు, పొలం అమ్మాము. ఉన్న

ఒక్క కూతురు, అల్లుడూ ఏక్సిడెంట్‌లో చనిపో యారు. కూతురు చనిపోక ముందు నుంచీ ఆ ఇద్దరు పసిగుడ్డులూ తమ దగ్గరే పెరుగు తున్నారు. తల్లీతండ్రీ లేని పిల్లలను అనాధ శరణాలయంలో చేర్పించాలిట. వాళ్ళు సురేష్‌కి బాగా మాలిమి అయ్యారు. వాళ్లని వదలడం మాటలా? పోనీ అల్లుడి తల్లిదండ్రుల దగ్గరకు పంపిద్దామంటే పెళ్ళయిన సంవత్సరానికే అల్లుడి తండ్రి పరమపదించాడు.

"నాన్నా... ఏమిటి అలా అయిపోయారు?" సురేష్ తండ్రిని కుదిపి అడిగాడు.

"బాబూ... బాధ పడకు. నీ భార్య చెప్పి నట్లు చెయ్యి. నీ అక్క పిల్లల్ని, మమ్మల్నీ ఇంకో ఇంట్లో ఉంచు. ఒరేయ్... ఈ వయసులో బిపి, షుగరుల బాధ పడలేము. వృద్ధుల ఆశ్రమంలో ఉండలేము"

తండ్రి మాటలకు కదిలిపోయాడు.

"వాడెవండీ మనల్ని వేరే ఉంచడానికి?" కళ్యాణి ఆవేశంగా ఏదో అనబోయింది.

"ప్లీజ్... కళ్యాణీ కొత్తగా పెళ్ళయిన ఈ నాటి ఆడవాళ్ళలో కొంతమంది భర్తతో వేరుగా ఉండాలి అని కోరుకుంటారు. స్వేచ్ఛగా, ఆనం దంగా ఇష్టం వచ్చినట్లు ఉండాలి అని కోరుకుం టారు. తన భర్త జీవితం, జీతం, తన పిల్లలూ తనకే సొంతమని అనుకుంటారు. తమ ఇంటి కి ఆడపడుచులు, మరిదులూ రాకూడదు. ఒక వేళ వచ్చినా తన భర్త సంపాదనలో వారు ఒక పైసా తీసుకెళ్ళకూడదు. రెండు రోజుల కన్నా వాళ్ళు ఎక్కువ రోజులు ఉండకూడదు. ఆడవాళ్ళ సైకాలజీ నేను చదివాను. మన కోడ లు కూడా ఇటువంటిదే."

"మన కోడలికి స్వార్థం ఎక్కువయింది. తన భర్త సంపాదన మామ, అత్తగారే కాకుండా ఆడపడుచు పిల్లలు కూడా అనుభవిస్తున్నారు. ఇలా అయితే తన పిల్లాడికి ఏం మిగుల్తుంది? వాడికి భవిష్యత్‌లో చదువు సంధ్యలు నేర్పాలి, ఆస్తి కూడబెట్టాలి. తల్లీతండ్రీ కూడా ఆమె పాట కి తందానతాన పాడుతున్నారు. ఇంకేం?... అగ్నికి ఆజ్యం తోడవుతూ ఉంది. మనవాడు ఇటు మనల్ని, అటు కొడుకునీ వదిలిపెట్టలేక సతమతమవుతున్నాడు!"

పుస్తకం చదివినట్లుగా తన తండ్రి తన మనసుని పూర్తిగా చదివేశాడు.

"నాన్నా... నేను ఏమన్నానంటే" అని సురేష్ ఏదో అనబోయాడు.

"నువ్వు... ఏమన్నావో నేను చెప్పనా? నీ బాబునురా నేను". "వస్తే రా... లేకపోతే నీ ఖర్మ... ఇక్కడే ఉండు. కలవాల్సిన చోట కలు ద్దాం అని చెప్పి వచ్చావు కదూ!"


అంతబాధలోనూ సురేష్ చిరునవ్వు నవ్వా డు.

* * *

సురేష్ వెళ్ళిన రెండు మూడు రోజుల దాకా తేరుకోలేకపోయింది రజని. భర్త అంటే ఆమెకు ఎంతో ప్రేమ. బాబు, తను, భర్త తాము ముగ్గు రూ మాత్రమే వేరు కాపురం ఎంతో బాగుంటుం ది. ఛ... నా షరతులు ఒప్పుకొని ఉంటే తమ జీవితం వేరుగా ఉండేది." ఆలోచనా స్రవంతి లో కొట్టుకుపోతున్న రజని ఆమె మేనత్త 'రజనీ' అని పిలిచే వరకూ ఈ లోకంలోకి రాలేదు.

"ఓ... నువ్వా అత్తా... బాగున్నావా? మావ య్య వచ్చారా?" సంతోషంగా అడిగింది రజని.

"మీ మావయ్యకు విడాకులిచ్చాను" అన్న అత్తమాటలకు రజని గతుక్కుమంది...




"నిజం చెప్పు అత్తా" ప్రాధేయపూర్వకంగా అడిగింది.

"ఊరికే అన్నాను రజనీ. మీ అమ్మ అన్ని విషయాలూ చెప్పింది. మీ అమ్మ, నాన్నను వదిలి ఉండగలవా? ఫోన్ చేయకుండా ఉండగలవా? మీ అమ్మానాన్నలను వదిలిపెట్టు. వారికి 'ఫోన్ చేయకు' అని మీ ఆయన, మీ అత్తమామలు ఎప్పుడైనా అన్నారా?"

"లేదు... వాళ్ళు నన్ను ఎప్పుడు పల్లెత్తు మాట అనలేదు".

"కొడుకు ఇష్టపడి చేసుకొన్నదానివి కాబట్టి వాళ్ళు నిన్ను ఎంతో మర్యాదగా చూసుకొంటున్నారు. కలిసి ఉంటే కలదు సుఖం. రోగాలు వచ్చినా కష్టాలు వచ్చినా, ఆర్థిక బాధలున్నా ఒకరికొకరు తోడు ఉంటారు. నువ్వు మీ అమ్మ, నాన్నలను వదిలి ఎలా ఉండలేవో, మీ ఆయన కూడా తన వాళ్ళని వదిలి ఉండలేదు. నీవు అలా అనడం అధర్మం. మీ అత్త, మామ ఉన్నదే నీ ఇల్లు. మీ అన్నయ్యకి పెళ్ళయి, నీ వదిన వచ్చి ఇది నా యిల్లు, నీ ఇంటికి పో... నీ కొడుకుని, నిన్నూ మేమెందుకు పోషించాలి? అంటే ఏం చేయగలవు?"

"అత్తా..." దిగ్భ్రాంతురాలయింది రజని.

"అవును రజనీ జరగబోయేది అదే..."

అప్పటికే తన ఆలోచనలలోని తప్పొప్పులను బేరీజు వేసుకొంటున్న రజనికి అత్తమాటలతో జ్ఞానోదయం అయింది, తను అత్త మామల్ని, సురేష్‌నీ అన్న మాటలకు కన్నీరు కార్చింది. ఒక్క క్షణం కూడా ఆ ఇంట్లో ఉండలేకపోయింది. తల్లీతండ్రీ రజని దగ్గరకు వచ్చారు. సూట్‌కేస్ తీసుకొని, కొడుకుని ఎత్తుకొన్న రజనిని చూసి అమ్మా! ఒక్కగానొక్క ఆడబిడ్డవు అందుకే ఏమనలేకపోయం. "పదమ్మా... అత్తవారింటికి" అన్నారు.